
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 24 జూన్ 2024
5
అన్నమయ్య



రాజకీయ కక్షలతో అధికారులను బలి చేయకండి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

పాలకుల స్వార్ధ రాజకీయాల కోసం అధికారులను బలి చేయొద్దంటూ ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న పోలీసు, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులపై రాజకీయ రంగు పులుముతూ పై స్థాయి అధికారుల సూచనలు మేరకు పని చేసిన కింది స్థాయి అధికారులు , ఉద్యోగులపై కక్ష సాధింపులకు పాల్పడటం పాలకులు మానుకోవాలని కోరారు. మొన్నటి వరకు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వానికి అనుకూలంగా కొంత మంది పోలీసు అధికారులు పని చేశారని, వారిపై రాజకీయ రంగు పులమటం సమంజసం కాదన్నారు. కింది స్థాయి అధికారులపై స్థాయి అధికారుల సూచనలు మేరకు ఉద్యోగం చేశారే కానీ వారికి రాజకీయ సంబంధం ఉండదన్నారు. నీతి నిజాయితీగా రాజ్యాంగ బద్దంగా పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు ఎఐటియుసి ఎర్ర జెండా అండగా ఉంటుందని తెలిపారు.

ఆరు నెలలు ఆగండి.. పోరాటం చేద్దాం

- వైసిపి కౌన్సిలర్లతో మాజీ సిఎం వై.ఎస్. జగన్
-జగన్‌ను కలిసేందుకు పోటెత్తిన జనం
- ప్రజా దర్బార్‌లో బిజీ బిజీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

'ప్రజలకు మేలు చేశాం.. మన ప్రభుత్వం వస్తుంది.. అధైర్య పడకండి.. ఆరు నెలలు ఆగండి..పోరాటం చేద్దాం' అని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైసిపి నాయకులు, మున్సిపల్ కౌన్సిర్లతో అన్నారు. వైఎస్‌ఆర్ జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం పట్టణ పరిధిలోని తన కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల వరకు ఆగండి ప్రభుత్వం ఏం చేస్తుందో వేచి చూద్దాం తర్వాత ప్రజా సమస్యలపై పోరాటాలు చేద్దామని చెప్పారు. తాను ఎప్పటికీ అందుబాటులో ఉంటానని అధైర్య పడకుండా ముందుకెళ్దామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు తమపై జరుగుతున్న దాడుల గురించి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. వివరించారు. అలాగే పట్టణంలో పలు పనులు ఇంకా పెండింగ్ ఉన్నాయని, చేసిన వాటికి కొంతవరకు బిల్లులు రావాల్సి ఉందని ఆయనకు, వాటిని వచ్చేలా ఆయనకు విన్నవించారు. దీనికి ఆయన స్పందిస్తూ గత ప్రభుత్వంలో నీరు చెట్టు కింద చేసిన పనులకు సంబంధించి పెండింగ్ ఉన్న బిల్లులను న్యాయస్థానానికి వెళ్లి తెప్పించుకున్నామని, అదే బాటలోనే మనం పోరాడుదామని ముఖ్య కార్యకర్తలకు హామీ ఇచ్చారు.



కౌన్సిలర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగన్

మా సమస్యలు జగన్మోహన్‌రెడ్డికి చెప్పండి

-వైఎస్ భారతికి మహిళా కౌన్సిలర్ల విన్నపం

పట్టణంలో జరిగిన అభివృద్ధిలో కేవలం కొంతమందికి మాత్రమే లబ్ధి చేకూరిందని, టిడిపి నాయకుల ఆగడాలు ఎక్కువయ్యాయని వీటిని జగన్మోహన్‌రెడ్డి చెప్పాలని మహిళా కౌన్సిలర్లు వై.ఎస్. భారతి కలిసి తమ బాధను వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని తన పార్టీ కార్యాలయంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి కౌన్సిలర్ సమావేశం అనంతరం మహిళా కౌన్సిలర్లు వైఎస్ భారతితో మాట్లాడారు. పులివెందుల మున్సిపాలిటీకి 33 మంది కౌన్సిలర్లు ఉండగా కేవలం ఒక ఆరుగురు మాత్రమే మద్ది పొందారని మిగిలినవారంతా చాలా బాధలు పడుతున్నామని చెప్పారు. కౌన్సిలర్‌గా ఉండి పిల్లల చదువులు కూడా చదివించుకోలేని పరిస్థితిగా నెలకొందని వాపోయారు. పేరుకు మాత్రమే కౌన్సిలర్‌గా మిగిలిపోయామని ఎన్ని బాధలు వచ్చినా, ఎన్ని కష్టాలు వచ్చినా, తాము జగన్మోహన్ రెడ్డి వెంటనే ఉంటామని, ప్రాణం ఉన్నంతవరకు వైసిపికి కోసమే పోరాడుతామని చెప్పారు. ఈ విషయాలను జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తమ న్యాయం చేసే విధంగా చూడాలని వారు వైఎస్. భారతిని వేడుకున్నారు.



వై.ఎస్.భారతితో మాట్లాడుతున్న మహిళా కౌన్సిలర్లు

సార్..మాకు ఏమి చేయలేదు : కౌన్సిలర్లు

అధికారంలో ఉన్న ఐదేళ్లూ తమకు ఏమీ మేలు జరగలేని మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. ఇందుకు జగన్ స్పందిస్తూ పులివెందుల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు మంజూరు చేశామని, మీరు చూస్తే ఏమి జరగలేదని అంటున్నారు.. ఏమిటని అన్నారు. దీనికి వారు స్పందిస్తూ 33 మందిలో ఆరుగురికి మాత్రమే మేలు జరిగిందని వాపోయారు. నిజమా అంటూ ముఖ్య నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తుంది.

ప్రజాదర్బార్‌కు పోటెత్తిన జనం..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి జనం పోట్టేత్తారు. పులివెందుల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందులలో ఉన్న విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లాలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచారు. జగన్ కలిసేందుకు గంటల తరబడి సమయం పట్టిన ఓపికగా క్యూలో నిలబడి కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు టిడిపి నాయకుల ఆగడాల గురించి జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరిస్తూ ఆప్యాయంగా పలకరిస్తూ సెల్ఫీలు దిగారు. సమస్యలపై పోరాటం చేద్దామని ఎవరు నిరుత్సాహపడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు.

జిల్లా ముఖ్య నేతలతో సమీక్ష

ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలతో వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటమికి గల కారణాలను, వైసిపి నాయకులు, కార్యకర్తలు పడుతున్న ఇబ్బందుల గురించి ఆరా తీసినట్టు తెలుస్తుంది. నియోజకవర్గాలలో అందుబాటులో ఉండి నాయకులలోను, కార్యకర్తలలోను ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నింపాలన్నారు. ఆరు నెలల వరకు వారు ఇచ్చిన వాగ్దానాలు ఏ మేరకు అమలు చేస్తారో వేసి చూద్దాం తర్వాత కార్యాచరణ ప్రకటిద్దామని నాయకులతో అన్నట్లు తెలుస్తుంది. కార్యక్రమంలో రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, జిల్లాలోని వైసిపి నాయకులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల జడ్‌పిటిసిలు, మండల అధ్యక్షులు, ఎంపిటిసి, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రాజంపేట టిడిపిలో అంతర్మథనం

ముగ్గురి వెన్నుపోటే ఓటమికి కారణమా?!
ఓటమికి గల కారణాలు సిఎంకు సుగవాసి ఏకరువు
టిడిపి మండలాల్లో వైసిపి మెజార్టీపై సీరియస్
లోపాయికారీ మద్దతుదారుల గుట్టురట్టు
త్వరలో సస్పెన్షన్లకు అవకాశం?

రాజంపేట టిడిపిలో అంతర్మథనం కొనసాగుతోంది. టిడిపి తరుపున అసెంబ్లీ బరిలో నిలిచిన సుగవాసి బాలసుబ్రమణ్యం ఓటమికి గల కారణాలపై మేథోమధనం జరుగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో టిడిపి గెలుపునకు అవకాశాలు కలిగిన అసెంబ్లీ స్థానాల్లో రాజంపేట ముందువరుసలో నిలిచిన సంగతి తెలిసిందే. టిడిపికి అనుకూలంగా వీచిన బలమైన గాలిలో రాజంపేటలో టిడిపి ఓటమి పాలు కావడాన్ని టిడిపి నాయకత్వం జీర్ణించుకోలేకపోతోంది. టిడిపి మెజార్టీ సాధించే మండలాల్లో వైసిపికి మెజార్టీ రావడానికి వెన్నుపోట్లే కారణమనే వాదన వినిపిస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఓటమి పాలైన అభ్యర్థులతో సమావేశంలో పార్టీ ఓటమికి గల కారణాలను ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో గెలుపునకు ముందువరుసలో ఉన్న రాజంపేటలో ఓటమికి వెన్నుపోటు పొడిచిన గుర్తైన నాయకులపై సస్పెన్షన్ వేటుపడే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాజంపేట టిడిపి సంస్థాగత సమస్యతో సతమతమవుతోంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో బరిలో నిలిచిన సుగవాసి బాల సుబ్రమణ్యం ఓటమికి గల కారణాలపై ఆరా తీస్తోంది. ఇందుకు ముగ్గురు నాయకుల వెన్నుపోటే కారణమనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఓటమి పాలైన సంగతి తెలిసిందే. వైసిపి కేడర్ టిడిపి శ్రేణులపై సాగించిన దాడుల స్వైర విహారాన్ని తట్టుకుని శ్రేణులను కాపాడుకునే ప్రయత్నాలను అప్పటి ఇన్‌ఛార్జి సమర్థవంతంగా నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ టికెట్‌ను కూటమి తరుపున బిజెపికి కేటాయించాల్సిన పరిస్థితుల నేపథ్యంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా రాజంపేట అసెంబ్లీ టికెట్‌ను సుగవాసి కుటుంబానికి కేటాయించడంతో అసంతృప్తి బుసలుకొట్టింది. సుగవాసికి గట్టి రాజకీయ నేపథ్యం ఉన్న సంగతి తెలిసిందే. ఇటువంటి కుటుంబాన్ని రాజకీయంగా కుదురుకోకుండా చేయాలనే ఉద్దేశంతో ముగ్గురు టిడిపి, అసంతృప్త నాయకులు తెరవెనుక చక్రం తిప్పి ఓటమి పాలు చేశారనే వాదన వినిపిస్తోంది.

స్వయంకృతరాధం లేదంటారా?

రాజంపేటలో టిడిపి ఓటమికి స్వయంకృతాపరాథమనే భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. వైసిపి సమిష్టి నాయకత్వంలో డబ్బుల పంపిణీ దగ్గర నుంచి నాయకులను కలుపుకొనిపోవడంలోనూ సమర్థవంతంగా వ్యవహరించిన సంగతిని ఉదహరిస్తుండడం గమనార్హం. సరిగ్గా ఇక్కడే టిడిపి అభ్యర్థి విఫలమయ్యారనే వాదన వినిపిస్తోంది. వైసిపి అసమ్మతి నేత నుంచి బలమైన వ్యతిరేకతను తట్టుకుని నిలబడేందుకు గల అవకాశాలను పరిశీలించింది. టిడిపి ప్రత్యర్థి నుంచి వచ్చిన బలమైన అనుచరులను సమర్థవంతంగా ఉపయోగించుకోలేకపోవడాన్ని స్వీయ తప్పిదంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ఓటమిని వెన్నుపోట్లపై నెట్టడాన్ని మినహాయించి చూడాలి. ఇందులో తనవంతు లోపమేమిటనేది ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

టిడిపి మండలాల్లో వైసిపి పాగా

రాజంపేట అసెంబ్లీ పరిధిలో రాజంపేట, నందలూరు, సుండుపల్లి, వీరబల్లి, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలు ఉన్నాయి. టిడిపికి సుండుపల్లి, సిద్దవటం, రాజంపేట, నందలూరు మండలాలు బలమైన మద్దతును కలిగి ఉన్న సంగతి తెలిసిందే. 2019 మినహా మిగిలిన ఎన్నికల్లో టిడిపి స్పష్టమైన ఆధిక్యతను కొనసాగిస్తూ వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా టిడిపికి బలమైన గాలివీచిన పరిస్థితుల్లో 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి లభించిన మెజార్టీ రావాలి. లేనిపక్షంలో టిడిపికి మద్దతు కలిగిన మండలాల్లోనైనా మెజార్టీ లభించి ఉండాలి. ఇటువంటి మండలాల్లో వైసిపికి మెజార్టీ రావడం వెనుక ఎవరి హస్తం ఉందనే అంశం చర్చనీ యాంశంగా మారింది. అసెంబ్లీలోని బూత్‌ల వారీగా రాబిన్‌సింగ్ టీముకు స్పష్టమైన అవగాహన కలిగి ఉంది. రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు ప్రాంతాలకు చెందిన కీలక నాయకుల పనితీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఐదేళ్లుగా వైసిపి అరాచక దాడులను తట్టుకుని నలిగిపోయిన కేడర్‌ను నిలువునా ముంచిన నాయకత్వంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఓటమిపై చంద్రబాబు ఆరా

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడలో రాష్ట్ర వ్యాప్తంగా ఓటమి పాలైన అభ్యర్థులతో ఇటీవల సమీక్షించిన సంగతి తెలిసిందే. పార్టీ ఓటమికి గల కారణాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. రాజంపేటలో టిడిపి ఓటమికి వెన్ను పోట్లే కారణమనే సమాచారం అందినట్లు పార్టీ వర్గాల అభిజ్ఞ. ఇందుకు బాధ్యులు ఎవరనే కోణంలో ఆరా తీసే ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తోంది. సర్వేబృందాలు, పార్టీ అంతర్గత బృందాలు, ఇంటెలిజెన్స్ ఇతర మార్గాల ద్వారా సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం. వివిధ సంస్థల సమాచారం ఆధారంగా నిర్ధారణకు రానున్నట్లు తెలుస్తోంది. అనంతరం వెన్నుపోటుదారులను సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

అన్ని రంగాల్లో తొగటవీర క్షత్రియులు రాణించాలి

- కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

తొగటవీర క్షత్రియులు అన్ని రంగాల్లో రాణించాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో తోకటవీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో తొగటవీర క్షత్రియుల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రోత్సాహక బహుమతులతో పాటు మెడల్స్, సర్టిఫికెట్, నగదు అందజేశారు. ఈ సందర్భంగా కదిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుకబడిన రంగంలో ఉన్న తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. నమ్మకం మనిషిని నడిపిస్తుందని పేర్కొన్నారు. కడప జిల్లాలో కల్యాణ మండపం, చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం కట్టించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకువెళ్తానని తెలిపారు. జీవితం ఒక పోరాటం అని, సంకల్పం ఉంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. విద్యార్థుల వినూత్నంగా ఆలోచించి అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. పిరికితనం వీడాలని చెప్పారు. సమస్యలను అధిగమిస్తూ పెద్దగా ఆలోచించాలని పేర్కొన్నారు. పేద కుటుంబంలో ఉన్న కులానికి ఏదో చేయాలని ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు అన్నిచోట్ల చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్మెంట్ గురించి తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వం చేనేతలను విస్మరించిందని, టిడిపి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాదు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడిన తర్వాత తల్లిదండ్రులను చూసుకోవడం మరచిపోవద్దన్నారు. 12 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. నగర అధ్యక్షులు కళ్యా సుధాకర్ మాట్లాడుతూ విద్య ఉన్నత శిఖరాలకు బాటలు వేస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి సుదర్శన్, గౌరవాధ్యక్షులు డాక్టర్ బండారు శ్రీనివాసులు, పల్లా బాలచౌడన్న, బొల్లు సోమశేఖర్, కందికండి రమేష్ బాబు, సుంకర రామచంద్రుడు, గోవిందు నాగరాజు, ఉపాధ్యక్షులు చౌడం సూరిబాబు, కార్యవర్గ సభ్యులు సుంకర శివశంకర్, టేకూరి పుష్పాంగదా, కాల్వ వాగేష్, బండిగింజల రంగనాయకులు, బొలిశెట్టి వెంకటస్వామి, బండి కృష్ణయ్య, మోతుకూరి సుబ్బరాయుడు, కొర్రకూటి వెంకటసుబ్బన్న, వేల్పుల ఉత్తన్న, గాలి. పుల్లయ్య, చింత సుబ్బరామయ్య, పల్లా జాలాపతి, ఉమ్మడిశెట్టి జనార్ధన్, కార్యనిర్వహక కార్యదర్శి పల్లా మురళీకృష్ణయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ఇల్లు కట్టేదెలా..!

- భారంగా నిర్మాణ సామగ్రి ధరలు
- రెండు గదులు, హాలు ఇంటి నిర్మాణానికి రూ.20 లక్షల పైనే ఖర్చు
- హడలిపోతున్న సామాన్య ప్రజానీకం

ప్రజాశక్తి-పుల్లంపేట

సామాన్య ప్రజానీకానికి సొంతింటి కల అందని ద్రాక్షగా మారింది. పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలతో సామాన్యులు ఇల్లు కట్టాలంటేనే హడలిపోయే పరిస్థితి నెలకొంది. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం రెండు పడక గదులు, హల్, వంటగది ఉన్న ఇంటి నిర్మాణం చేయాలంటే రూ.20 లక్షలు పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంటి నిర్మాణం వైపు ఆలోచించాలంటేనే సామాన్య ప్రజానీకం వణికిపోతున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సాయానికి, అయ్యే ఖర్చుకు పొంతన లేకపో వడంతో ఇంటి నిర్మాణం వైపు సామాన్యులు ఆలోచించడం వదులుకుం టున్నారు. అత్యధికం మంది సొంతిల్లు నిర్మాణాలను వేసవిలో ఎక్కువ చేపడ తారు. దానికి కారణం వాతావరణం అనుకూలంగా ఉంటుందని. ప్రస్తుత వేసవిలో కొత్త ఇంటి నిర్మాణాలు పెద్దగా నిర్మా ణాలు జరగలేదని తాపీ పని వారు చెబుతున్నారు. ప్రభుత్వం మండల పరిధిలో దాదాపు వందల సంఖ్యలో ఇంటి స్థలాలు ఇచ్చినప్పటికీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసేందుకు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం నిర్మాణ వ్యయమే. ప్రస్తుత పరిస్థితుల్లో టన్ను ఐరన్ ధర రూ.70 వేలు, ఇసుక ట్రాక్టర్ రూ.5వేలు, రెండువేల ఇటుకల ట్రాక్టర్ ధర రూ.20వేలు పలుకుతోంది. సిమెంట్ బస్తా రూ.400 చేరింది. భవన నిర్మాణకార్మికులకు రోజు కూలి రూ.1000లకు చేరింది. ఇంటి గుమ్మాలు, కిటికీలుచ విద్యుత్ సామగ్రి, ఇతర ఖర్చులు తడిసి మోపిడుగు తున్నాయి. ఇల్లు కట్టాలంటే వెనుకాడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభు త్వం రెండు లక్షలు మాత్రమే సాయం చేస్తుంది. ఈ సొమ్ము విడుదలకు కూడా సవాలక్ష అంశాలు పెడుతుంది. ప్రభుత్వం ఇచ్చే సాయం ఏమాత్రం పెంచడం లేదు. ఇంటి నిర్మాణానికి దిగితే అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడు తుతోంది ఇంటి నిర్మాణాలు చేపట్టమే మానుకున్నారు. కష్టపడి నిర్మించుకున్న ఇంటిని అమ్ము కోవాల్సిన పరిస్థితులు ఏర్పడు తున్నాయి. ఇంటి నిర్మాణానికి బ్యాంకులు హౌసింగ్ లోన్‌లు ఇస్తున్నాయి. కూలీ పనులు సామాన్య ప్రజానీకం ప్రతినెల బ్యాంకులకు ఇఎం ఐలు కట్టడం కష్టతరమైన పని కావడంతో సామాన్యులు భయ పడుతున్నారు. భూముల ధరలు పెరిగిపో వడంతో సామాన్యులు సెంటు భూమి కొనలేని పరిస్థితి ఏర్పడింది. సొంతిల్లు సైతం కట్టు కోలేని పరిస్థితి నెలకొం దని. 20 లక్షలు ఖర్చుపెట్టి ఇంటి నిర్మాణం చేయడం తమకు ఏమాత్రం సాధ్యం సామా న్యులు పేర్కొంటున్నారు. వేలాది రూపా యలు చెల్లించి అద్దె ఇంటిలోనే ఉండి పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఆర్థిక సాయం పెంచాలని లేకుంటే ప్రభుత్వమే సొంతింటిని నిర్మించి ఇవ్వాలని పేద, మధ్య తరగతి ప్రజలు కోరుతున్నారు.





నిర్మాణంలో ఉన్న గృహాలు

117 జిఒ రద్దుకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : నూతన ప్రభుత్వం కొలువు తీరి నూతన మంత్రివర్గం కూడా బాధ్యతలు చేపట్టారని, ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యం కావడానికి, ఉపాధ్యాయ పోస్టులకు కుదింపునకు, వారి పని భారం విపరీతంగా పెరగడానికి కారణమైన 117 జిఒను వెంటనే రద్దు చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం కడప జిల్లా శాఖ అభ్యాస వర్గ సమావేశం అలంఖాన్‌పల్లెలోని యతి ఆశ్రమంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్‌సి ప్రకటి ంచడం హర్షణీయమని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ డిఇఒ పూల్‌లో ఉన్న పండిట్, పిఇటిలకు కు ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలను కూడా విడుదల చేయాలని పేర్కొన్నారు. ఎపి జిఎల్ఐ, పిఎఫ్, ఇహెచ్ఎస్ పెండింగ్ బిల్లుల సమస్యలు కూడా ఎక్కడికక్కడ పేరుకున్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టం చెన్నయ్య, దేవిరెడ్డి కొండా రెడ్డి రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరామిరెడ్డి, రాష్ట్ర సేవా కార్యదర్శి ఎరుకల రెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల ప్రతి నిధులు పాల్గొన్నారు.

వైవీయూ, పద్మావతి విశ్వవిద్యాలయం మధ్య ఎంఒయు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం, తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయం మధ్య పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదిరింది. యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపి వెంకటసుబ్బయ్య, ఐటి సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ తుమ్మలకుంట శివ, శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతి, రిజిస్ట్రార్ ఆచార్య రజిని ఎంఒయు పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా విసి ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ వైవీయూతో అనేక సాంకేతిక పరమైన ప్రయోజనాలు పొందేందుకు ఒప్పందం చేసుకున్నామన్నారు. అసిస్టెంట్లు అసోసియేట్ ప్రొఫెసర్ల ఉద్యోగోన్నతలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ దగ్గర నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్య వరకు సాంకేతికతను వినియోగించి తొలి విశ్వవిద్యాలయంగా వైవీయూ ఉండడంతో ఎంఒయు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. వైవీయూ ఐ టి హబ్ సేవలను పొందనున్నామని తెలిపారు. తద్వారా సిఎఎస్ ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని ఆకాంక్షించారు. వైవీయూ రిజిస్టార్ ప్రొఫెసర్ వైపి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వైవీయూ ఐటి హబ్ అందించే సేవల ద్వారా ఆర్థిక ప్రయోజనం విశ్వవిద్యాలయానికి సమకూరుదన్నారు. ఐటి హబ్ డైరెక్టర్ తుమ్మలకుంట శివ మాట్లాడుతూ ఎంఒయుకు మూడేళ్లఏళ్ల కాల పరిమితి ఉంటుందన్నారు. రెండు విద్యాలయాల మధ్య సాంకేతిక పరమైన సహాయ సహకారాలు అందుతాయన్నారు.

ఆర్‌టిసి ప్రాంగణంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శుచి, శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టినట్లు డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. స్థానిక బస్టాండు ప్రాంగణం, పరిసరాల్లోని వివిధ రకాల వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు చెత్త–చెదారం, ఇతర వ్యర్థాలను చీకట్లో తీసుకొచ్చి బాధ్యతారహితంగా, ఇష్టానుసారం బస్టాండ్ వెనుక భాగంలో పడేసి వెళ్లడం, బహిరంగ మల, మూత్ర విసర్జనలు చేయడం జరిగేదని అన్నారు. అలాగే బస్టాండ్ పరిసరాలు కుళ్లిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతూ అనారోగ్య వాతావరణానికి కారణమయ్యేవని చెప్పారు. దీంతో తాను స్పందించి అక్కడి వ్యర్థాలను తొలగింపుకు చర్యలు చేపట్టి, ఆర్‌టిసి ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచడానికి తమతో ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిఎం తోపాటు ఆర్‌టిసి టిఐ బాబు నాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న డిఎం

టిడిపి పూర్వవైభవం కోసం కృషి

- 'చమర్తి'కి ముఖ్యమంత్రి సూచన

ప్రజాశక్తి -రాజంపేట

రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం కోసం కృషి చేయాలని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును చమర్తి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టిస్తే రాజంపేటలో ఓటమికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఓటమికి గల కారణాలను అడిగి తెలుసుకుని తెలుగుదేశం పార్టీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి బలోపేతానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారని తెలిపారు.



చంద్రబాబునాయుడుతో చమర్తి జగన్‌మోహన్‌రాజు

29 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చిన్న ముక్క పల్లెలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 29 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు నియోజకవర్గంలోని కె.వి.పల్లె, యర్రావారిపాలెం, కలికిరి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, సత్యసాయి జిల్లాలోని కదిరి, ఎన్‌పి కుంట కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట, గండి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 29 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేపట్టారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి కోసం మదనపల్లికి చెందిన కీర్తిశేషులు రిటైర్డ్ టీచర్ ఫడితం లక్ష్మయ్య భార్య పద్మావతి రూ.25 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీ స్వరూప గుప్తా,ఆస్పత్రి కోశాధికారి శివప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఎపిఐఐసి మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కంటివైద్యులు సురేష్ బాబు, మహాలక్ష్మి, ఆప్తమాలిక్ స్టంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-కలకడ

1984-85 సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. మండలంలోని నడిమి చర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984-85వ సంవత్సరంలో చదివిన పదవ తరగతి బ్యాచ్ కి చెందిన విద్యార్థులు వివిధ రకాల ఉద్యోగాలు, వ్యవసాయం, తదితర వృత్తుల్లో ఉంటూ ఆదివారం కలవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. పాఠశాలలో చదివేటప్పుడు తమ అనుభూతులను నెమరు వేసుకుని ఆనందాన్ని పంచుకున్నట్లు తెలిపారు. అనంతరం వీరు చదువుతున్న సమయంలో ప్రధానోపాధ్యాయులుగా ఉండి విశ్రాంతి పొందిన ఓబులరెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రెడ్డిశేఖర్, రెడ్డి ప్రసాద్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

మంత్రి 'మండిపల్లి'ని సన్మానించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

అమరావతిలోని సచివాలయంలో మంత్రి మండిపల్లి రాంప్ర సాద రెడ్డిని రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. రాష్ట్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. రైల్వే కోడూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహారెడ్డి పాల్గొన్నారు.



అన్నం ప్యాకెట్లు అందజేస్తున్న ఆర్‌బికె చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

ఘనంగా కెంపేగౌడ జయంతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ కొత్తకోటలోని స్థానిక జ్యోతి బస్టాండ్ వద్ద ఆదివారం మొరుసునాపు రెడ్డి కులస్తుల ఆరాధ్యుడు కెంపేగౌడ 515వ జయంతిని మొరుసునాపురెడ్డి (వక్కలిగల)సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్,'కెంపేగౌడ జిందాబాద్' నినాదాలు చేసి అనంతరం 500 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ మా కులదైవం అయిన కెంపేగౌడ జయంతిని జరపడం చాలా సంతోషకరమని అన్నారు. ఆయన అడుగుజాడల్లో మేము నడుస్తూ ముందుకు వెళ్తామని, సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మొరుసునాపు రమేష్‌రెడ్డి, మార్కెట్ ఆంజనేయరెడ్డి, నారాయణస్వామిరెడ్డి, ఆనందరెడ్డి శివారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నూతన మంత్రులను కలిసిన సురేంద్ర యాదవ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కూటమి ప్రభుత్వం కొలువుదీరి, చంద్రబాబు నాయుడు మంత్రి మండలిలోని పలువురు మంత్రులు తమ బాధ్యతలను స్వీకరించారు. ఆదివారం టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ మంత్రులు నారా లోకేష్, మంత్రి కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలను వారివారి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి మండలి యువకులతో ఉత్సాహం ఉరకలెత్తిస్తోందన్నారు. ఇక రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన మంత్రి మండలి కూర్పు అద్భుతంగా ఉందని కితాబునిచ్చారు. అసెంబ్లీకి రావడానికి మాజీ సిఎం జగన్, వైసిపి ఎమ్మెల్యేలకు మొహం చాలాటం లేదన్నారు. రాష్ట్రంలో వైసిపి దాదాపు కనుమరుగైపోయినట్లేనని అన్నారు. కార్యక్రమంలో నాగరాజు, మనోహర్ నాయుడు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అతిసారను అరికట్టండి : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె



రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లో అతిసార వ్యాధి రోజురోజుకూ ఎక్కువైందని, ఈ వ్యాధిని ఆరికట్టాలి పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అతిసార వ్యాధితో వచ్చే రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అతిసార వ్యాధితో నలుగురు చనిపోయారని తెలిపారు. 40 మంది చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జొన్నల దొడ్డిలో ఒకరు మరణించగా 36 మంది చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. చిన్న పిల్లల్లో అతిసార ప్రాణాంతకమన్నారు. తాగునీటి పైపులు లీకేజీ కావడం, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో అతిసార సోకుతుందని తెలిపారు. ప్రభుత్వం సురక్షితమైన తాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించాలని కోరారు. ఓఆర్ ప్యాకెట్లు, సెలెన్ బాటిళ్ల కొరత లేకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సువర్ణదేవి తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆమె తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన(గ్రీవెన్స్‌సెల్) స్థానంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు, రైతులు నుంచి అందిన ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె తెలిపారు. **దువ్వూరు :** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఉమారాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో స్పందన కార్యక్రమం బదులుగా ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే అర్జీల ద్వారా ప్రతి సోమవారం తమ కార్యాలయంలో ఇవ్వవచ్చన్నారు. ఈ అవకా శాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. **పులివెందుల రూరల్ :** పులివెందుల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ డివి రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేయాలని కోరారు. అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత

- పెరిగిన విద్యార్థుల సంఖ్య
- 57 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 3780 మంది
- కేవలం 88 మంది ఉపాధ్యాయులతోనే బోధన

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పట్టిపీడిస్తోంది. పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని మౌలిక వసతుల ఏర్పాటుతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. గత ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుతోంది. అయితే విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులు కొరతతో నాణ్యమైన విద్య కొరవడుతోంది. మండలంలో 57 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3780కి పైగా విద్యార్థులు చదువుతుండగా ఉపాధ్యాయులు కనీసం 118 మంది ఉండాల్సి ఉండగా కేవలం 88 మంది మాత్రమే పని చేస్తున్నారు. 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా, 60 మంది విద్యార్థులకు కూడా ఒకే ఒక ఉపాధ్యాయుడు ఉండడం ఆశ్చర్యకరం. గతంలో విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలలో విద్యా వాలంటరీ వ్యవస్థ అమల్లో ఉండేదని, అది పూర్తిగా కనుమరుగైపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఉపాధ్యాయులు కొరత అధికంగా ఉన్న పరిస్థితులు గమనించి తల్లిదండ్రులు ప్రయివేట్ పాఠశాలలపై మొగ్గు చూపుతున్నారని, గతం కన్నా ఇప్పుడు ప్రయివేట్ పాఠశాలలు పుష్కలంగా విద్యార్థులతో కలకలలా డుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి పాఠశాలల రూపు రేఖలు మారిన ఉపాధ్యాయులు లేకపోవడం బాధా కరని ఆవేదన చెంతుదున్నారు. జిల్లాలోని ఉపాధ్యాయుల కొరత ఉన్న ఏకైక మండలం చిట్వేలి మండల మేనని చెబుతున్నారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించినా విద్యను బోధించే ఉపాధ్యాయులు లేకపోతే ప్రయోజనమేమిటని విద్యార్థుల తల్లిదం డ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత పరిష్కరించాలని కోరుతున్నారు.



40 మంది విద్యార్థులకు ఒకరే ఉపాధ్యాయుడు ఉన్న యం.గొల్లపల్లి పాఠశాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతపై ఉన్నత అధికారులకు సమాచారం ఇస్తూనే ఉన్నాం. ఎవరైనా ఉపాధ్యాయుడు అనారోగ్య సమస్యతో సెలవు తీసుకుంటే ఆ పాఠశాలకు పంపేందుకు గతంలో సిఆర్‌పిలు ఐదుగురు ఉండేవారు. వారు కూడా ఇప్పుడు ఇద్దరే ఉండటంతో పెద్ద సమస్యగా మారింది. ఏడాదికి పైగా కష్టంగా నెట్టుకొస్తున్నాం.

-కోదండనాయుడు, ఎంఇఒ, చిట్వేలి

కెసి కాలువకు వర్షపు నీరు విడుదల



ప్రజాశక్తి - చాపాడు

కడప-కర్నూలు (కెసి) ప్రధాన కాలువకు రాజోలి ఆనకట్ట నుండి వర్షపు నీటిని అధికారులు విడుదల చేశారు. మూడు రోజులుగా కాలువలో నీరు ప్రవహిస్తోంది. దీంతో వాగులు, వంకలకు నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం కెసి ప్రధాన కాలువలో వంద క్యూసెక్కులకు పైగా నీరు విడుదలైంది. కెసి కాలువకు నీరు విడుదల కావడంతో చుట్టుపక్కల గ్రామాల బోరు బావుల్లో నీటిమట్టం పెరిగింది. పశువులకు తాగునీటికి ఉపయోగకరంగా ఉంది. రజకులు తమ వృత్తి చేసుకునేందుకు అనువుగా నీరు లభ్యమవుతోంది. రాజోలి ఆనకట్ట వద్ద నీరు సమృద్ధిగా వర్షపునీరు ఉండడంతో కుందూ నదికి, కెసి కాలువకు నీరు అందుబాటులో ఉంది. పశువులకు మేతకు అవసరమైన గడ్డి జాతులను రైతులు సాగు చేస్తున్నారు.

గండి పూడ్చివేతలకు అధికారుల చర్యలు

మండల పరిధిలోని పల్లవోలు గ్రామ సమీపంలో రెండు రోజుల క్రితం కెసి ఉపకాలువకు గండి పడింది. ఈ విషయాన్ని రైతులు కెసి కెనాల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎఇ జాన్సన్ ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపి వారి ఆదేశాల మేరకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించి మరమ్మతులు చేపట్టారు. జెసిబి యంత్రంతో గండి పూడ్చి సమస్యను పరిష్కరించారు. రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడుతుండడంతో కెసి కాలువకు నీరు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాలువకు రాజోలి ఆనకట్ట నుంచి వర్షపునీరు విడుదలైంది.



కాలువకు పడిన గండిని పూడ్చుతున్న అధికారులు

విచ్చలవిడిగా విదేశీ సిగరెట్లు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలో ఏ అంగడిలో చూసినా విదేశీయ సిగరెట్లు దర్శనమిస్తూనే ఉన్నాయి. కొంతమంది వ్యాపారస్తులు పులివెందులలో వీటిని చిల్లర అంగళ్లకు భారీగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ నిషేధిత విదేశీయ కొన్ని సిగరెట్లు తదితర రకాల పేర్లతో ఎలాంటి అనుమతులు లేకుండా వాటిని తెప్పించుకొని ప్రజల ప్రాణాలను హరింపజేస్తూ.. లక్షల రూపాయలు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని కంపెనీ సిగరెట్లను బ్యాగులోపైన పెట్టుకుని అడుగుభాగమంతా ప్రభుత్వ నిషేధిత విదేశీయ సిగరెట్లు రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. ఇవి బజారులో క్రయవిక్రయాలు జరగకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ అంగళ్లకు రవాణా చేస్తున్నారు. కంపెనీ సిగరెట్ కొనాలంటే రూ.10, రూ.18 పెట్టాల్సి ఉంది. నిషేధిత సిగరెట్లను ఒక్కొక్కదాన్ని రూ.1, రూ.2తో కొనుగోలు చేస్తున్నారు. వీటిని తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కంపెనీ సిగరెట్లు ఒక ప్యాక్ ధర రూ.100, రూ.180 ఉంది. ప్రభుత్వ నిషేధిత, మొదలగు సిగరెట్లు ప్యాక్ ధర రూ.20మాత్రమే. ఇవి కంపెనీ సిగరెట్లను పోలి ఉండ డం, తక్కువ ధరకు దొరకడంతో అమ్మకాలు జోరుగా ఉన్నాయి. ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసి రోజుకు రెండు మూడు ప్యాక్‌ల సిగరెట్లు కాలు స్తున్నారు. ఈ సిగరెట్ తాగడం వల్ల ఊపిరితిత్తులు పాడైపోవడం, గుండె సంబంధ వ్యాధులు వస్తాయని టివిల్లో, సినిమా థియేటర్‌లలో ప్రభుత్వం పబ్లిసిటీ చేస్తున్నప్పటికీ అమ్మేవారు పులివెందులలో ఎక్కువగా ఉన్నారు. అవి అమ్మకూడదని తెలిసినప్పటికీ విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్నారు. నిషేధిత సిగరెట్లు మార్కెట్లో తక్కువ ధరకు దొరుకుతుండడంతో విద్యార్థులు వాటికి బానిసలవుతున్నారు. పిల్లల ఆరోగ్యాలు పాడవుతాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10, 15ఏళ్ల వారు ఈ సిగరెట్లను ఎక్కువ మోతా దులో సేవిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ నిషేధిత సిగరెట్ల అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. లక్షలు వెచ్చించారు.. ప్రహరీ నిర్మాణం మరిచారు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. వైద్య, విద్య ఆరోగ్య రంగాలకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. మండల పరిధిలోని పత్తూరు పంచాయతీ డాంఖాన్‌పల్లెలో లక్షలాది రూపాయలతో వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాన్ని నిర్మిం చారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో వీటిని ప్రారంభించారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టినా.. భవనాలకు రక్షణ లేకుండా పోయింది. ఆరోగ్య కేంద్రంలో ఉండే విలువైన పరికరాలకు రక్షణ లేదు. ప్రహరీ నిర్మిం చకపో వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆస్పత్రి పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. పశువులు సంచరిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. ప్రహరీ నిర్మించి, ఆస్పత్రికి ముఖద్వారం ఏర్పాటు చేస్తే విలువైన పరికరాలకు రక్షణ ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. పరిసరాలు శుభ్రంగా మారుతాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రహరీకి నోచుకోని వైయస్సార్ విలేజ్ క్లినిక్ కేంద్రం

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి : సర్పంచ్ శ్రీను

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందులకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు కలిశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా జగన్‌రెడ్డి పులివెందులకు విచ్చేశారు. ప్రజలు భారీ సంఖ్యలో మాజీ సిఎంను కలవడానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో పులివెందులలోని తన ఇంట్లోనే జగన్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులుతో పాటు పలువురు వైసిపి నేతలు ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు. వైసిపితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. వైసిపి నేతలు ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని కోరారు.

తేక్వాండో పోటీలకు ఇరువురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈ నెల 27, 28, 29, 30 తేదీల్లో నేపాల్ రాజధాని కాట్మండ్‌లో నిర్వహిం చనున్న అంతర్జాతీయ తేక్వాం డో పోటీలకు ప్రొద్దు టూరుకు చెంది న ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక ముని పల్ వైవిఎస్ బాలికోన్నత పాఠశాలలోని జవహర్ బాల కేంద్రంలో మాస్టర్ మునీశ్వర్ శిక్షణ లోని విద్యార్థులు తెక్వాం డోలో విశేష ప్రతిభ కనబ రుస్తున్నారు. 32 కిలోల సబ్-జూనియర్ క్యాట గిరీలో బొల్లవరం బ్రాంచ్‌లోని చైతన్య స్కూల్‌కు చెందిన 4వ తరగతి విద్యార్థి యం.సుదీప్, 55కిలోల సీనియర్ క్యాటగిరీలో శివకుమార్ ఎంపికయ్యారు. వీరు మరెన్నో విజయాలు సాధించాలని తేక్వా ండో మాస్టర్ మునీశ్వర్, ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్‌రెడ్డి అభినందించారు.

ప్రేక్షకులను అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. శ్రీ యువరాజ్ డాన్సింగ్ స్కూల్ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన క్లాసికల్, జానపద, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పా రామం పరిపాలన అధికారి సుధాకర్, శిక్షకుడు యువరాజ్ పాల్గొన్నారు.

'అయ్యన్న'కు స్పీకర్ పదవి సమర్ధనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కరుడు కట్టిన తెలుగుదేశం పార్టీ నాయకుడిగా పార్టీ కష్టాల్లో ఉంటే వెన్నుచూపక పోరాటం చేసిన నాయకుడు చింతకాయల అయ్యన్న పాత్రుడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా నియమించడం సమర్ధతకు పట్టం కట్టినట్టుందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. ఆదివారం పాత బస్టాండ్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయల్లో 7 సార్లు ఎమ్మెల్యేగా,1 సారి ఎంపీగా, నాలుగు సార్లు మంత్రిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా కొనసాగడం అంటే ఒక చరిత్ర అన్నారు. అసెంబ్లీని సజావుగా నడిపించి, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారి వారి నియోజకవర్గాల ప్రజల కష్ట నష్టాలు కావాల్సిన సౌకర్యాలు, మంచి ప్రశాంత వాతావరణం కల్పించి చర్చ జరిగే విధంగా అవకాశం కల్పించి సభా మర్యాదలను, సాంప్రదాయమును కాపాడుతారన్నారు. మళ్ళీ అసెంబ్లీలో పాతకాలం సమావేశాలు మాదిరి జరిగి ప్రజల మన్ననలు పొందే విదంగా సాగుతాయని పేర్కొన్నారు.



మాధవరెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగ సిబ్బంది

ఉద్యోగ విరమణ సర్వ సాధారణం

ప్రజాశక్తి-కలకడ

ఉద్యోగ విరమణ సన్మాన సభను మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిం చారు. కలకడ ఎస్ఒ పరిధిలో ఉన్న కోన గ్రామంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్న మాధవరెడ్డి 43 సంవత్సరాలు పోస్టల్ సేవలో సేవలందించి ఈనెల 20న ఉద్యోగ విరమణ చెందారు. కలకడ ఎస్ఒ ఆనంద అధ్యక్షతన మాధవరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఒ మాట్లాడుతూ మాధవరెడ్డి పోస్టల్ ఉద్యోగంలో ఎనలేని సేవ చేయడం జరిగిందని ఆయన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్ బిఎ రాష్ట్ర సెక్రెటరీ మురళి, శ్రీధర్‌బాబు, డివిజన్ సెక్రెటరీ వెంకట్రామయ్య, హేమ చంద్రారెడ్డి, కమల్నాథ్, మునుస్వామి, రఫిక్, సాయికుమార్, అక్కులప్ప, ఆకాష్, మునిలక్ష్మి పాల్గొన్నారు.



బాధితుడితో మాట్లాడుతున్న సాయివికాస్‌రెడ్డి

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చిట్వేలి

చిట్వేలిలోని మండలం కెఎస్ అగ్రహారం దళితవాడకు చెందిన మూడపోతుల నరసింహులు గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానంద్ రెడ్డి తనయులు ముక్కా విశాల్‌రెడ్డి, ముక్కా సాయి వికాస్‌రెడ్డి ఆ కుటుంబానికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పెంచల్ రెడ్డి, మురళి, రాజుగుంట సర్పంచ్ గుత్తి నరసింహ, గదంశెట్టి వెంకటేష్, పొన్నారెడ్డి, పవన్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఉచిత వైద్య సేవలు ఎంతగానో ఉపయోగపడుతాయని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఉన్న సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ జమ్మలమడుగు ఆధ్వర్యంలో శాంతిరామ్ కంటి హాస్పిటల్ వైద్య బృందం సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా జమ్మలమడుగు, దాని పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఉచితంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించడం మా ధ్యేయమన్నారు. రోటరీ కార్యదర్శి శివ గణపతి, రోటరీ క్లబ్ మెంబర్, ముద్దనూరు ఎఒ మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవకు ప్రతి రూపమన్నారు. కార్యక్రమంలో శాంతిరామ్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ నాగార్జున మాట్లాడుతూ రోటరీ సంస్థ ద్వారా కలిసి పేద ప్రజలకు రూపాయ ఖర్చు లేకుండా ఉచితంగా కంటి పరీక్షలు, ఆపరేషన్ చేయడం తమవంతు అని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, పెద్దలు నాగేశ్వరరెడ్డి, కుండా భాస్కర్, ఓబులరెడ్డి, సంజీవ రాయుడు, శ్రీనివాసులు, సభ్యులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సగల మహేంద్ర బాబు, ఐఇసి శ్రీనివాస పవిత్రం, ఐపిసి నామ జనార్దన్, ఆర్‌సి బల్స్ జనార్దన్, జెసి నాగభూషణం వాసవి క్లబ్ సభ్యులతో కలిసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా స్థానిక సాయిబాబా దేవాలయం వద్ద వ్యాపారం చేసుకుంటున్న వర్తకులకు గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ సమీపంలోని వాసవి కాలనీ పిల్లలకి పుస్తకాలు పంపిణీ చేశారు. విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకెట్‌లతోపాటు మాస్కులను అందజేశారు. స్థానిక అమ్మవారి శాలలో వాసవి క్లబ్ నూతన సభ్యులను చేర్పించిన సభ్యులకు, నేత్రదానం, అవయవ దానం చేసిన దాతలకు ఘన సన్మానం చేశారు. అనంతరం ఆలయ పరిసరాలను శుభ్రపరిచారు. చివరగా శ్రీ వాసవి ఫంక్షన్ హాల్‌కు 2000 లీటర్ల వాటర్ ట్యాంక్‌ను వాసవి క్లబ్ తరఫున అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం మనసుకు చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దువ్వూరులో గాంధీ విగ్రహం ఆవిష్కరణ

దువ్వూరు : మండల కేంద్రమైన స్థానిక శ్రీ మరకత వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ దేవది ఉపేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం డాన్‌డస్క్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

క్రైం కార్నర్



స్మగ్లర్ల అరెస్టును చూపుతున్న అటవీశాఖ సిబ్బంది

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- నాలుగు దుంగలు, కారు, బైక్ స్వాధీనం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మండలంలోని సానిపాయ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లును అరెస్టు చేసి వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలతో పాటు కారు, బైక్,ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.టాస్క్‌ఫోర్స్ ఎస్‌పి పి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు డిఎస్‌పి చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్‌రెడ్డికి చెందిన ఆర్‌ఎస్ఐ సురేష్‌బాబు టీమ్ శనివారం రాత్రి నుంచి సానిపాయ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. ముదుంపాడు అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారని వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా పారిపోవడానికి ప్రయత్నించగా వారిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన విజయకుమార్, మోహనవేల్, శక్తివేల్‌గా గుర్తించినట్లు తెలిపారు.వారిని అరెస్టు చేసి తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తుమని టాస్క్ ఫోర్స్ సిఐ శ్రీనివాసులు తెలిపారు.